పైపులైన్ నిర్మాణానికి డబ్బుల డిమాండ్

ముషీరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అషీర్‌ఖానా వీధిలో డ్రైనేజీ పైపు లైన్ నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. పైపులైన్ నిర్మాణంలో భాగంగా స్థానికుల ఇళ్లకు సంబంధించిన డ్రైనేజీ పైపులు పగిలిపోయాయి. కొత్త పైపులకు కాంట్రాక్టర్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పది పైపులకు రూ. 10 వేలు డిమాండ్ చేస్తున్నాడని స్థానికుడు పి. శ్రీకాంత్ యాదవ్ ఆరోపించారు. జలమండలి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటే.. చేసుకోమని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తప్పని పరిస్థితిలో డబ్బులు ఇచ్చి పైపులైన్ వేయించుకుంటున్నామని స్థానికులు అంటున్నారు.



కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్

ఆత్మరక్షణకు బాలికలు కరాటేలో శిక్షణ పొందాలి

● సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్

బర్కత్‌పుర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం బాలికలు కరాటేలో శిక్షణ పొందాలని సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ బి. ఆనంద్ సూచించారు. ఆగస్టు 4 నుంచి బెంగళూరులో జరగనున్న షోటోఖాన్ జాతీయ కరాటే పోటీలలో రాష్ట్రం నుంచి పాల్గొనే విద్యార్థులలో జీవీఆర్ కరాటే అకాడమీకి చెందిన 12 మంది బాలికలు, ఏడుగురు బాలురు ఎంపికయ్యారు. మంగళవారం బర్కత్‌పురలోని అకాడమీలో వారిని అడిషనల్ డీసీపీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పతకాలే లక్ష్యంగా పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, సెంట్రల్ జోన్ ఇన్‌స్పెక్టర్ జి. కిషన్, అకాడమీ నిర్వాహకులు జి. అమృతారెడ్డి, ఘన సంతోషిణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లను సన్మానించిన జాయింట్ కమిషనర్ రమేష్

ఆర్టీసీ అభివృద్ధికి కార్మికులు ప్రధాన పాత్ర పోషించాలి

బర్కత్‌పుర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లు అంకితభావంతో పని చేస్తూ ప్రమాదాల నివారణలో ప్రధాన భూమిక పోషించాలని ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ సి. రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం కాచిగూడ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి కార్మికులు ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. ఆర్టీసీ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ బి. వరప్రసాద్ మాట్లాడుతూ.. పలు డిపోలకు చెందిన డ్రైవర్లు మహ్మద్ జహీరుద్దీన్, ఎం. నర్సింహ, కె. రామదాస్, వి. అశోక్, వి. మల్లారెడ్డి, శంషీర్‌ఖాన్, మహ్మద్ నజీరుద్దీన్, కె. ఎల్లప్పను ప్రమాద రహిత డ్రైవర్లుగా ఎంపిక చేసి సన్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు సుచరిత, బాబునాయక్, కాచిగూడ డిపో మేనేజర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో డీఎస్‌పీ పోటీ

రాంనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ తెలిపారు. 'స్థానిక ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ రాష్ట్ర సమావేశం కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశారదన్ మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో పార్టీ బలోపేతానికి సంస్థాగత నిర్మాణం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ సభ్యత్వాన్ని జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో నిర్వహించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కందేల సుమన్, శ్రీకాంత్, మేకల సుమన్, తలారి రాంబాబు, హరీష్‌గౌడ్, వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

కొత్త క్రిమినల్ చట్టాలపై
న్యాయవిద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలి

రాంనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయ విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయలక్ష్మి అన్నారు. నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు సదస్సులు నిర్వహించాలని ఆమె అభిప్రాయపడ్డారు.. అంబేడ్కర్ లా కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లిలో నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన అధ్యక్షతన నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక యాదవ్, డాక్టర్ రాంప్రసాద్ తదితరులు న్యాయ వ్యవస్థలో మార్పులు, నూతన క్రిమినల్ చట్టాలపై విద్యార్థులకు గల సందేహాలను నివృత్తి చేశారు. కొత్త చట్టాలపై విస్తృత అవగాహన సదస్సులను న్యాయకళాశాలల నిర్వాహకులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయలక్ష్మి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిక్కడపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి దరఖాస్తు చేసుకున్న 17 మందికి చెక్కులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే ముఠా గోపాల్ వారికి మంగళవారం గాంధీనగర్ క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాకేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, ముఠా నరేష్, శివముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



దోమలగూడ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య, దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- కవాడిగూడ, ఆంధ్రజ్యోతి



జంటనగరాల మహేంద్రసంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు



శాస్త్రినగర్ పోచమ్మ ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు



ముషీరాబాద్‌లో తేజాగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి తదితరులు

వైభవంగా ఫలహారం బండ్ల ఊరేగింపు

బోనాల వేడుకలను పురస్కరించుకొని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో సోమవారం అర్ధరాత్రి వరకు ఫలహారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో పోతరాజులు ఆకట్టుకున్నారు. పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

- ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం, ఆంధ్రజ్యోతి



చప్పల్ బజార్‌లో ఫలహారం బండి ఊరేగింపులో పోతరాజుల సందడి



రాంనగర్‌లో అమ్మవారి ఊరేగింపు



రాంనగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు



చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో బోనాల వేడుకల్లో గ్రంథాలయ కార్యదర్శి ఎం. పద్మజ, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ రియాజ్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఏపీఎస్ రాజు తదితరులు



రాంనగర్‌లో సతీష్ యాదవ్, పూస మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు

ప్రధాని మోదీ పోకడలతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

● ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అనుసరిస్తున్న హానికరమైన పోకడలతో ప్రజాస్వామ్యం పెను ప్రమాదంలో పడిందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు.. ఈడీ, సీబీఐని ఉపయోగించి ప్రతిపక్షాల అణచివేతకు పాల్పడుతున్నారని అన్నారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ చట్టవిరుద్ధమని ధ్వజమెత్తారు. అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును నిరసిస్తూ మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నేతలు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, కాల్వ సుజాత, సీపీఐ నేత బాల మల్లేష్, సీపీఎం నాయకుడు డీజీ నర్సింహారావు, ఆర్‌ఎస్‌పీ నేత జానకిరామ్‌తో కలిసి మాట్లాడారు.

కేజ్రీవాల్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరాధారమైన కారణాలతో విపక్ష నేతలను టార్గెట్ చేసి మోదీ ప్రభుత్వం జైలుకు పంపిస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీలను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు.



నిరసన తెలుపుతున్న దిడ్డి సుధాకర్, ఆప్ నేతలు తదితరులు

ధర్నాలో ఆప్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునాగౌడ్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ ముల్లంగి, నాయకులు కొడంగల్ శ్రీనివాస్, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ లక్ష్నాయుడు, దివ్యాంగ విభాగం అధ్యక్షుడు దర్శనం రమేష్, అధికార ప్రతినిధి జావెద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు అపార్ట్‌మెంట్‌లో చోరీ

ఫ్లాట్ తాళాలు పగులగొట్టి 50 తులాల బంగారం, లక్ష రూపాయలు అపహరణ

కవాడిగూడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున గల ఓ అపార్ట్‌మెంట్‌లో పట్టపగలు ఫ్లాట్ తాళాలు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు 50 తులాల బంగారం, లక్ష రూపాయలు అపహరించుకుపోయారు. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ ఆస్పత్రి ఎదుటగల కృష్ణానగర్ కాలనీలోగల భవానీ శ్రీ షీలా అవెన్యూ అపార్ట్‌మెంట్‌లోగల 303 ఫ్లాట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఉద్యోగి శ్రీనివాస్, భార్య సబిత, కుమార్తె అనుష్కతో కలిసి అద్దెకు ఉంటున్నారు. మంగళవారం ఉదయం శ్రీనివాస్ కార్యాలయానికి, కుమార్తె కాలేజీకి వెళ్లగా.. సబిత అనారోగ్యంగా ఉండడంతో పుట్టింటికి వెళ్లింది.

శ్రీనివాస్ కుమార్తె సాయంత్రం 6 గంటలకు ఇంటికి రాగా తలుపునకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. అనుష్క వెంటనే తండ్రి, తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పి, డయల్ 100కు ఫోన్ చేసి తమ ఇంట్లో చోరీ జరిగిందని చెప్పింది. శ్రీనివాస్ వెంటనే ఇంటికి వచ్చి బీరువాలో భద్రపరిచిన 50 తులాల బంగారం, లక్ష రూపాయలు చోరీ అయ్యాయని గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ మొగులయ్య, సీఐ డి రాజు పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. స్థానికంగాగల సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించారు. అపార్ట్‌మెంట్‌కు ఎవరెవరు వచ్చారనే వివరాలు తెలుసుకున్నారు. తెలిసిన వారే చోరీ చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చిందరవందరగా పడేసిన బీరువాలోని వస్తువులు

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే శ్రీనివాస్

పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిజాం క్లబ్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనకు నియామక పత్రాన్ని కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమరావు, సభ్యులు వీరమళ్ల ప్రకాష్, పూల రవీందర్, రౌతు కనకయ్య, సి.విఠల్, మీసాల చంద్రయ్య, ఆకుల రజిత అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మున్నూరుకాపులతో పాటు బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమం ఉన్నతికి ప్రభుత్వపరంగానూ, వ్యక్తిగతంగానూ చేయూత అందిస్తానన్నారు. అపెక్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆగస్టు 10న కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సభ్యులు మంగళారపు లక్ష్మణ్, ఆది విష్ణుమూర్తి, ఎస్.మల్లేష్, ఎర్ర నాగేందర్, ఊసా రఘు, బి.శ్రీరామ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న సర్దార్ పుటం పురుషోత్తమరావు తదితరులు

గంజాయి మత్తులో వాచ్‌మన్‌పై దాడి

● ఘటన ఆలస్యంగా వెలుగులోకి

బర్కత్‌పుర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు యువకులు వాచ్‌మన్‌పై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బర్కత్‌పుర లలితా అపార్ట్‌మెంట్‌లో ఆంజనేయులు(45) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 27వ తేదీ ఉదయం 5గంటలకు పాల ప్యాకెట్ కోసం వెళ్తున్నాడు. గంజాయి మత్తులో ఉన్న యువకులు ఆంజనేయులును పిలిచారు. వారి ప్రవర్తన గమనించిన ఆంజనేయులు వారి వద్దకు వెళ్లలేదు. గంజాయి మత్తులో ఉన్న యువకులు ఆగ్రహంతో వాచ్‌మన్‌పై దాడిచేయడంతో తల, దవడ భాగంలో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాల మహానాడు మహిళా విభాగం
జాతీయ అధ్యక్షురాలిగా నాగమల్లేశ్వరి

పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి నియమితులయ్యారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న 'హలో మాల-చలో ఢిల్లీ' జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు.



నాగమల్లేశ్వరికి నియామకపత్రం అందజేస్తున్న చెన్నయ్య

మహాభారతం ప్రపంచానికి మార్గదర్శకం

● ఉడిపి పీఠాధిపతి విద్యా దీషా తీర్థ స్వామీజీ

బర్కత్‌పుర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వేద వ్యాసుడు రచించిన మహాభారతం నేటి ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందని ఉడిపి పీఠాధిపతి విద్యా దీషా తీర్థ స్వామీజీ అన్నారు. మహాభారతంలో లేని అంశం లేదని, సమాజానికి సంబంధించిన అన్ని విషయాలు ఇందులో ఇమిడి ఉన్నాయని స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి బర్కత్‌పుర లింగంపల్లి చౌరస్తాలోని రాఘవేంద్ర స్వామి బృందావన సమితిలో మహాభారతంపై ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. శాంతియుత జీవనానికి మహాభారతం ఆదర్శమని స్వామీజీ అన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలు మహాభారతాన్ని అధ్యయనం చేస్తున్నాయన్నారు. అనుశాసన పర్వం ప్రధానమైందన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర స్వామి బృందావన సమితి అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి రాఘవేంద్రరావు, అనంత మూర్తి తదితరులు పాల్గొన్నారు. ప్రవచనాల కార్యక్రమం సెప్టెంబర్ 18 వరకు కొనసాగనుంది.



ప్రవచనాలు చేస్తున్న ఉడిపి పీఠాధిపతి విద్యా దీషా తీర్థ స్వామీజీ

నర్సింగ్ కౌన్సిల్‌ను ప్రక్షాళన చేయాలి

బర్కత్‌పుర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్‌ను ప్రక్షాళన చేయాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ 11 ఏళ్ల నుంచి ఒకేచోట తిష్టవేసి అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని, ఒక్కొక్క వ్యక్తి 5 నుంచి 20 కాలేజీలను నడుపుతూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నర్సింగ్ కౌన్సిల్‌లో అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శివకృష్ణ, న్యాయవాది వంశీ, మధు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీలా వెంకటేష్

ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపర్చాలని
సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు

రాంనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్, కాలుష్య సమస్య పరిష్కారం కోసం ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపర్చాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆగస్టులో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను రెట్టింపు చేయాలని, మెట్రో రైలు బోగీలను మూడు నుంచి ఆరుకు పెంచాలని, ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. ఆగస్టు నెలలో ఆందోళన కార్యక్రమాలతోపాటు సంతకాల సేకరణ చేపడతామని తెలిపారు. సమావేశంలో పార్టీ నేతలు శ్రీనివాస్‌రావు, మహేందర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

సినారెకు నివాళి



త్యాగరాయగానసభలో మంగళవారం సినారె జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకన్ని సినారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, నైషధం సత్యనారాయణ మూర్తి, గాయని సీత, నృత్యగురువు అపర్ణ పాల్గొన్నారు. సినారె చేసిన సేవలను వారు కొనియాడారు.

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి